క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పరవాడ: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈపీడీసీఎల్ ఏఈ శేషసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా పరవాడ, గొర్లివానిపాలెం, భర్నికం, పి.బోనంగి, కలపాక, రావాడ, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం గ్రామాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కాళీయ మర్దనుడిగా దర్శనమిచ్చిన అప్పన్న



కాళీయ మర్దనుడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వరాహ లక్ష్మీనృసింహస్వామి కాళీయ మర్దనుడిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కాళీయమర్దనుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో వేంచేయజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

18 నుంచి సీఐటీయూ అఖిలభారత మహాసభలు



జెండా ఆవిష్కరిస్తున్న గనిశెట్టి

పరవాడ: ఈ నెల 18 నుంచి 22 వరకు బెంగళూరులో నిర్వహించనున్న అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన పరవాడ సినిమాహాలు కూడలి, ఫార్మాసిటీలో ఐవోసీ కూడలి ప్రాంతాల్లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. గనిశెట్టి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మహాసభలో చర్చిస్తారన్నారు.దానిప్రకారం భవిష్యత్తులో చేయబోయే పోరాటాలకు సంబంధించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై గర్జన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అప్పారావు, వెంకునాయుడు, చిన్నారావు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాస పూజలు



సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై మంగళవారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం తిరుప్పావై సేవాకాలం నిర్వహించి గోదాదేవికి, వేంకటేశ్వరస్వామికి విశేషంగా పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు సామూహికంగా ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

– శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

వాహనాల వేలం నేడు

మద్దిలపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్–3 స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నామని సర్కిల్–3 ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటిండెంట్ ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలోని స్టేషన్‌లో సాయంత్రం 4 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఉదయం స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

టీడీఎస్‌పై ఫార్మా ప్రతినిధులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ శంకర్‌పాండే

పరవాడ: ఆదాయ పన్ను చట్టంలో ఇటీవల జరిగిన సవరణల (టీడీఎస్)పై ఫార్మా యాజమాన్య ప్రతినిధులకు జేఎన్ ఫార్మాసిటీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును రాంకీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ ప్రారంభించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ శంకర్ పాండే మాట్లాడుతూ ఆదాయపన్ను చట్టంలో జరిగిన సవరణలపై కర్మాగార అధికారులకు అవగాహన కల్పించారు. చట్టంలో 194 ఆర్, 194 క్యూ, 206 ఎబీ, 206 సీసీఏ సెక్షన్లను వివరించారు. అనంతరం ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి. లాల్‌కృష్ణ మాట్లాడుతూ టీడీఎస్‌లో సవరణలపై ఫార్మా యాజమాన్య ప్రతినిధులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి చొరవ చూపిన ఆదాయ పన్ను శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ వై.విష్ణువర్ధన్ రెడ్డి, జేఎన్‌పీసీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు, శివరాంప్రసాద్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

22 నుంచి రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్వామీజీ

సీతంపేట: మాఘ మాసం సందర్భంగా రాజశ్యామల మాత నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో నిర్వహించనున్నామని మాతా శారదా ఫౌండేషన్ చైర్మన్ ఆచార్య గురవరేణ్య కుమార స్వామీజీ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం పెదపూడి ప్రశాంత్‌కుమార్, మంచా మల్లేశ్వరి, శంకర్ దేవర, మును పల్లతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ దేవీ నవరాత్రి ఉత్సవాల మాదిరిగానే రాజశ్యామల మాత ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. రోజుకొక రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. నిత్యం అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు లక్ష మంది వరకు భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న స్వామినాయుడు



భోగిమంట చుట్టూ సందడి చేస్తున్న విద్యార్థులు



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న పాఠశాల డైరెక్టర్ ఉదయ నాగశ్రీ

పరవాడ/సబ్బవరం: పరవాడ, సబ్బవరం మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. సబ్బవరం పాఠశాల ప్రిన్సిపాల్ స్వామినాయుడు భోగి,సంక్రాంతి విశిష్టతను వివరించారు. విద్యార్థులకు ముగ్గులు,గాలిపటాలు ఎగురవేయడం వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు హరిదాసు, బుడబుక్కలు, జంగం వేషధారణలో సందడి చేశారు. ఎస్.సీతాలక్ష్మి, ఉదయనాగశ్రీ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జయప్రకాష్ నారాయణ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సెంట్రల్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వి.జయప్రకాష్ నారాయణ, సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చంద్రశేఖర్ ఆజాద్ స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం అధికారులు అందజేశారు.

కార్మికుడికి న్యాయం చేయాలి



కార్మికుడిని పరామర్శిస్తున్న గనిశెట్టి

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో సువెన్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు చెందిన ఓ కార్మికుడు ఈ నెల 7న విధుల్లో ఉండగా లీకైన అమోనియా గ్యాస్ పీల్చడం వల్ల అస్వస్థతకు గురైనట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ చెప్పారు. ప్రమాదంలో ఎస్.అప్పారావు(44)అనే కార్మికుడు అస్వస్థతకు గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు అప్పారావును గనిశెట్టి మంగళవారం పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రమాదాన్ని గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వ అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం లేదని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు.

ఏయూ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

- అవసరమైన మరమ్మతులకు వీసీ ఆదేశం
- ఫార్మసీ హాస్టల్ నిర్వహణపై ప్రశంసలు



ఫార్మసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలోని శ్రీకృష్ణదేవరాయ హాస్టల్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు పలు మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావుకు సూచించారు. వర్సిటీలో హాస్టళ్లను విభజించి, పర్యవేక్షణ బాధ్యతలు యూనివర్సిటీ ఇంజినీర్లకు అప్పగించాలన్నారు. ప్రతి హాస్టల్‌లో కాలానుగుణంగా అవసరమైన మరమ్మతులు గుర్తించి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. దీని వల్ల విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన చేయడంతో పాటు భవనాలను దీర్ఘకాలం పరిరక్షించడం సాధ్యపడుతుందన్నారు.

అనంతరం ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌ను కూడా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతుల కల్పనపై ఆరా తీశారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహిస్తున్న విధానంపై ప్రశంసించారు. విద్యార్థినులకు ఉపయుక్తంగా మరిన్ని వసతుల కల్పన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.కె.ఎం.పవార్, సీఎస్‌వో మహ్మద్ ఖాన్, ఇంజినీరింగ్, హాస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధారోత్సవాలు ప్రారంభం



గంగధార వద్ద గోదాదేవికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఆలయం నుంచి తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారికి గంగధార జలాలతో అభిషేక సేవ నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన మండపంలో అమ్మవారిని వేంచేయజేశారు. విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. పాశుర విన్నప పారాయణాన్ని విశేషంగా పఠించారు. అనంతరం అమ్మవారిని పలకిలో ఆలయంలోకి తీసుకెళ్లి బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు కుమారాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొలువుదీరిన వనితా వాకర్స్ కార్యవర్గం

మురళీనగర్: స్థానిక వనితా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం కొలువుదీరింది. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కు వనితా భవన్‌లో సాయంత్రం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్పీ రవీంద్ర సమక్షంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నరు ఉప్పలపాటి శుభ నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవీంద్ర మాట్లాడుతూ వనితా వాకర్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నూతన కార్యవర్గం సభ్యులు సమన్వయంగా పనిచేసి వాకర్స్ క్లబ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా అధ్యక్షుడు డీడీ నాయుడు, సెక్రటరీ జనరల్ శీలం ఐజాక్, అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, రీజనల్ కౌన్సిలర్ ఎ.లక్ష్మీరెడ్డి, డిస్ట్రిక్ట్ ఎలక్ట్ గవర్నర్ (2024) టి.రంగారావు, వనితా వాకర్స్ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మ, ఉపాధ్యక్షురాలు కె.వినీల, కార్యదర్శి ఎస్.రోజారాణి, కోశాధికారం షీలా, ప్రోగ్రాం ఇన్‌చార్జి శిరీష లత పాల్గొన్నారు.



వనితా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

కరాటేలో బెల్ట్స్, సర్టిఫికెట్ల ప్రదానం

కంచరపాలెం: యంగ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్టర్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటేలో క్రీడాకారులకు గ్రేడింగ్ బెల్ట్స్ టెస్ట్ నిర్వహించారు. మంగళవారం డీఎల్‌బీ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోటీలో పసుపు రంగు నుంచి బూడిద రంగు బెల్ట్ వరకు ప్రతిభ ఆధారంగా క్రీడాకారులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ అనేది ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత బెల్ట్ నుంచి ఉత్తీర్ణులైన వారికి అప్ గ్రేడ్ బెల్ట్ అందిస్తామని చెప్పారు. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు ముఖ్యఅతిథిగా హాజరై కరాటే పిల్లలకు బెల్ట్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, కోచ్ తులసీరావు, గ్రాండ్ మాస్టర్ పుష్పరావు, ప్రసాద్, జి.వంశీ, తదితరులు పాల్గొన్నారు.